తెలతెల వారుతోంది. వాకిళ్లలో చీపుర్ల బరబరలు అప్పుడప్పుడే మొదలయ్యాయి. వీధుల్లో పాల వాళ్ల సందడి ఇంకా సద్దు మణగలేదు. ముప్పాతిక వంతు జనాలింకా నిద్రావస్థలోనే వున్నారు.

అలాంటి సమయంలో మొదలయింది వరమ్మ ప్రభాతసేవ

"ఓయి నీ దిక్కుమాలిన మూక నాశనం గానూ- ఏం రోగమొచ్చిందే అట్లా విరగబడి పోతున్నారూ. మీ దినం చెయ్యా- ఇంట్లో బతకనిచ్చేట్టు లేరేమే. మీ కడుపు కాలా- ఏం గోల చేస్తున్నారే మీ జిమ్మ పడిపోనూ..." అట్లా సాగిపోతోంది.

# గప్‌చుప్

- వలివేటి నాగచంద్రావతి




నిద్రమత్తు వీడక ఇంకా పక్కమీదే దొర్లుతున్న వాళ్లూ, మసగ మసగ్గా వున్న వాతావరణాన్ని కిటికీలో నుంచి కళ్లు అరమూసి చూసి ఇంకో అరగంట దాకా లేవక్కరలేదనుకుంటూ మళ్లీ రగ్గులు ముసుగు పెట్టబోతున్న వాళ్లూ, ప్రశాంతంగా మొదలయ్యి రోజంతా సంతోషంగా గడిచేలా చేయమని దైవాన్ని స్మరిస్తూ అరచేతిలో శ్రీరామ చుట్టుకుంటున్న వాళ్లూ అంతా ఒక్కమాటుగా కొరడా విదిలింపు తిన్నవాళ్లలా తుళ్లిపడి లేచి కూర్చుంటున్నారు తిట్టుకుంటూ.

వరమ్మ చీకట్నే లేస్తుంది. లేస్తూనే అంట్లు పెరట్లో పడేస్తుంది. అంతవరకూ లేద్దామా వద్దా అని పస్తాయిస్తూంటాయ్ బాదం చెట్టు మీద కాకులు. ఆ గిన్నెల చప్పుడుకు వాటికి చలనం వస్తుంది. అంట్ల గిన్నెల్లో మెతుకుల కోసం అవి కాట్లాడుకొంటూ గంతులేస్తాయ్. వరమ్మ తిట్ల దండకం ఎత్తుకుంటుంది పెద్ద కంఠంతో.

ఆ చుట్టుపక్కల వాళ్లందరికీ అదే మేలుకొలుపు.

ఎవరికే రకంగా నన్నా తెలవారవచ్చును గాక ఆ వీధివాళ్లకి మాత్రం ఈ రకంగా తెల్లారాల్సిందే.

'దీని దుంపతెగా- ఈ ముసల్దాని నోరెప్పుడు పడిపోతుందో గానీ అప్పటిదాకా మనకీ శని వదల్దు-' అని లోలోపలే పళ్లు కొరుక్కుంటూ శాపనార్థాలు పెట్టడమే కానీ ఒక్క

రికీ వరమ్మ ఎదురుబడి, "ఎందుకమ్మా అంత గొంతూ-" అని అడిగే దమ్ము మాత్రం లేదు. "అమ్మో ఆ గయ్యాళి గచ్చ నోట్లో నోరు పెట్టి నెగ్గగలమనే-" అనేస్తారు.

వరమ్మకు నాలుగు వాటాలున్న ఆ ఇల్లు తండ్రి నుంచి సంక్రమించిన ఆస్తయితే ఆ గయ్యాళి తనం, గత్తరతనం సొంతంగా సమకూర్చుకున్న సంపద.

తల్లిదండ్రులకు ఏకైక సంతానం ఆమె.

'అయ్యో ఒక్కగానొక్కరు' అనుకుంటూ తల్లీ తండ్రీ చూపించే అదుపులేని గారాబం పిల్లల మనస్తత్వం మీద ఎలాటి వికార ముద్ర వేస్తుందో, ఆ తరవాత అది ఎలాటి వికృత రూపం దాలుస్తుందో వరమ్మను చూసి తెలుసుకోవచ్చును.

చిన్ననాడు కూతురి మీద వెర్రి అభిమానంతో కొండమీద కోతి కావాలంటే అది అసాధ్యమయిన కోరిక అని తెలియజెప్పే బదులు తనకు మించిన శ్రమ అయినా పడి అగ్గగ్గలాడుతూ ఆ కోరిక తీర్చేవాడు తండ్రి.

పిచ్చి మమకారం మూలంగా బుద్ధి మీద పొరలు గమ్మటం వల్ల లోకంలో తన బిడ్డ ఒక్కతే మాణిక్యం- మిగతా వాళ్ల పిల్లలందరూ గాజు పూసలే అన్న దురభిప్రాయం తను ఏర్పరచుకోవటమే కాకుండా కూతురి మనస్సులో కూడా అదే భావాన్ని పాతి పెంచి పోషించింది తల్లి.

ఈ అతి ధోరణిలో పెరిగిన వరమ్మకు చదువూ సంధ్యా అబ్బలేదు గానీ పెంకితనం, మంకుతనం, 'నా అంతటి వారు లేరన్న విర్రవీగుతనం మాత్రం చిన్నతనం నుంచే అలవడ్డాయి.

బాల్యం వదిలినా ఆ పొగరూ వగరూ తగ్గించుకోవాల్సిన అవసరం రానీకుండా కూతురికి ఆట బొమ్మలూ ఆభరణాలూ కొని పెట్టినట్లే ఒక మొగుణ్ణి కూడా బేరం చేసి ఇల్లరికం తెచ్చాడు తండ్రి.

పాపం దశరథరామయ్య బహు మేదకుడు. ఇంట్లో భార్యా భర్తల కంఠస్వరాల్లో ఏ ఒక్కరిదో వినిపిస్తే చాలనుకునే వెర్రి బాగులవాడు. ఆ ఒక్కటీ తన గొంతు అయ్యేకంటే ఖంగుమంటూ మోగే భార్య గొంతు అయితేనే సంసారం గుంభనంగా జరుగుతుందని గ్రహించిన బుద్ధిమంతుడు.

ఆయన బతికినన్నాళ్లూ 'వరమ్మగారి మొగుడు'గానే బతికాడు.

అలాగ నిరాటంకంగా సాగిపోయిన ఆవిడ ఏకచ్ఛత్రాధిపత్యం కోడళ్ల గృహ ప్రవేశంతో భంగం కలిగే సూచనలు కనిపించాయి.

ఏ మాటకామాటే చెప్పుకోవాలి- అంతవరకూ ఇంట్లో ఎంత అధికారం, అహంకారం చూపించినా ఒక మోతాదు మించకుండా కొంచెం సంయమనంతోనే వ్యవహరించేది వరమ్మ.

ఎప్పుడయితే తన పీఠం కదలబోతోందనీ, తన మాట ఇకముందు చెల్లబోదనీ భయం పట్టుకుందో అప్పట్నుంచే వరమ్మ విచక్షణారహితంగా నోరుపెట్టుకు రెచ్చిపోవటం మొదలు పెట్టింది.

ముళ్ల పొదలతో మోదినట్టు కురుస్తున్న అత్తగారి పరుష వాక్య వర్షధాటికి తట్టుకోలేక కోడళ్లు చేతులు పైకెత్తేశారు.

తన విజయానికి కారణమయిన సాధనం- నోరుపెట్టుకు నెగ్గుకు రావటమనే ఆ ఫార్ములా అంటే ఆవిడకి చాలా మక్కువ ఏర్పడిపోయింది. దరిమిలా దాన్ని ఒక కళగా సొంత బాణీలో హాబీగా చాలా అభివృద్ధి చేసుకున్నదావిడ.

ఇప్పుడు వరమ్మ ఇంట్లో వాళ్లనీ బయట వాళ్లనీ కాదు- కాకుల్నీ కుక్కల్నీ, పిచ్చుకల్నీ, చీమల్నీ కూడా ఆడిపోసుకోగలదు. ఆరడి పెట్టగలదు. కాలక్షేపంగా ఆనందించగలదు. ఆమె బారిన పడిన ఏ జీవీ వాయింపించుకోకుండా తప్పించుకోలేదు ఇంతవరకూ.

కాకపోతే ఆవిడకి ఆనందకారకమయిన ఆ ప్రక్రియ మిగతా జనానికి ప్రాణ సంకటంగా వుండవచ్చు. ఆ గొంతు మూగపోయే శుభ ఘడియ ఎప్పుడా అని ఆశతో ఎదురు చూడవచ్చు.

కానీ ఇంతవరకూ ఆ నోటికి సవాలుగా నిలిచిన సాహసులింతవరకూ ఆవిడకెదురవలేదు. అసలు పుట్టారో లేదో కూడా ఆ దేవుడికే ఎరుక.

★ ★ ★

అంట్ల గిన్నెల ప్రహసనం తరవాత కుళాయి దగ్గర రెండోది మొదలయింది.

వరమ్మ భర్తపోయాక నిప్పులు కడిగేటంత మడి పాటిస్తోంది. ఆవిడ తన మడినీళ్లూ, మైలనీళ్లూ చాదస్తం కొద్దీ కిందకు పారబోసే నీళ్లూ... ఇవన్నీ పట్టుకునే దాకా ఆ ఛాయలకి మరొకరు రావటానికే వీల్లేదు.

అలాంటిది ఆ రోజు అలవాటుకి భిన్నంగా సుజాత పంపు దగ్గరకు వచ్చింది.

"మామ్మ గారూ! ఒక్క బకెట్ నీళ్లు పట్టుకోనివ్వరూ-" వరమ్మ సంగతి ముందే తెలుసు గనక అణకువగానే అడిగింది.

"ఎవరే నీకు మామ్మ- నువ్వే మామ్మవి, అమ్మమ్మవి, అవ్వవి'' వరమ్మ కయ్యిమన్నది.

"పోన్లెండి. మీకంటే ముసల్దాన్ని నేను. ఒప్పుకుంటాను. ఒక్క బకెట్ నీళ్లివ్వండి. రాత్రి తొట్లో నీళ్లన్నీ గుడ్డ ఒదులయి కారిపోయాయి. ఆయనేమో అర్జంటుగా బయటికి వెళ్లాలంటున్నారు. స్నానానికి నీళ్లులేవు. ఒక్క బకెట్ నీళ్లిచ్చారంటే చాలు-" ప్రాధేయపడింది సుజాత.

"వీల్లేదు. నీ అవసరం అర్జంటయితే నా అవసరం యమర్జంటు. ఈ కుళాయినాది. నేను పట్టుకునే నీళ్లన్నీ పట్టుకునే దాకా ఇంకొకళ్లకి ఒక్క చుక్కన్నా ఇవ్వను గాక ఇవ్వను''

వరమ్మ ఒక బిందె భుజానికెత్తుకుని మరో బిందె పంపుకింద వేసి ఇంట్లోకి వెళ్లిపోయింది.

ఉస్సూరంటూ అట్లాగే నిలబడి పోయింది సుజాత- 'మళ్లీ వచ్చినపుడు ఇంకోసారి అడిగి చూస్తే ఇవ్వకపోదు' అన్న ఆశ చావక. రెండు నిమిషాలు గడిచాయి. బిందెనిండింది. వరమ్మ రాలేదు. ఇంకో నిమిషమయింది. నీళ్లు పొర్లి పోతున్నాయి. వరమ్మ ఇంకా రాలేదు.

ధైర్యం చేసింది సుజాత- ఆ బిందె పక్కకి లాగి తన బకెట్ పంపుకింద పడేసింది.

అప్పుడొచ్చింది వరమ్మ. ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి చూసింది. దర్జాగా పంపుకింద వుండాల్సిన తనబిందె ఔటయిన ఆటగాడిలా పక్కనుంది. సుజాత చేతిలో బేలగా వూగులాడాల్సిన బకెట్ హుషారుగా నీళ్లతో నిండుకొంది.

ఇంక చెప్పేదేముంది- బ్రహ్మాండాలు బద్దలయ్యాయి. మూడో కన్నొక్కటే తక్కువగా విలయకాలంలో రుద్రుడిలా చిందులు వేస్తూ బకెట్ విసిరేసింది వరమ్మ.

"ఒసే నీ ధైర్యం కూలిపోనేవ్- నా బిందె ముట్టుకోటానికి నీకెన్ని గుండెలేవ్... నీ చేతు


## బంగారం చాలా చౌక ఇంగ్లీషు మీదే ఇక

5 నెలల్లో ఇంగ్లీషు మాట్లాడేస్తారు !! తెలుగు తెలిస్తే చాలు !




**మొత్తం రూ ॥ 100 లాభం**

750 పేజీల 25 పాఠాలు మొత్తం కోర్స్ రూ॥ 275

శక్తి కాలేజి వారి దశమ వార్షిక సందర్భంగా

బంగారం లాంటి అవకాశం

మొత్తం కోర్స్ రూ॥ 175 మాత్రమే

మరి రూ॥ 100 లాభమేకదా!

వాయిదాలలో తీసుకుంటే నెలకు 40 రూ॥ చొప్పున

5 నెలలకు మొత్తం 200 రూ॥ చెల్లిస్తే చాలు

మరొక ప్రత్యేక సదుపాయం

**ముందుగా డబ్బు చెల్లించనవసరంలేదు**

పోస్ట్‌మేన్ మీదగ్గర పాఠాలు అందించినపుడు డబ్బుచెల్లిస్తే చాలు. అంటే మేము పాఠాలను వి.పి.పి. ద్వారా పంపుతాం పాఠాలధర చెల్లిస్తేచాలు. వి.పి.పి ఖర్చులు మావే.

ఈరోజే క్రింద వున్న కూపన్ కత్తిరించి వివరాలను పూర్తిచేసి కవరులోపెట్టి, కూపనులో తెలిపిన మా చిరునామాకు పంపండి. పాఠాలను వెంటనే మీకు వి.పి.పి ద్వారాపంపుతాం.

**కోర్స్ లో చేరడానికి కూపన్**

SHAKTI COLLEGE
13, MADLEY ROAD, T.NAGAR, MADRAS - 600 017

E.N

శక్తి కాలేజి వారి బంగారం లాంటి అవకాశం కల్పించండి

☐ నాకు 25 పాఠాలు మొత్తం పంపండి. పోస్ట్‌మేన్ దగ్గర రూ ॥ 175 చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

☐ నాకు వాయిదాలలో మొదటి 5 పాఠాలు పంపండి. పోస్ట్‌మేన్ దగ్గర రూ॥ 40 చెల్లించి పాఠాలను తీసుకుంటాను.

(కావలసిన గడిలో ✓ గుర్తించండి)

పేరు..................................................

చిరునామా.............................................

.......................................................

పిన్‌కోడ్

**శక్తి కాలేజిలో చేరండి సరళంగా ఇంగ్లీషులో మాట్లాడండి.**

లిరిగిపోనేవ్- నిన్నగాక మొన్నొచ్చావ్ నీకింత తలపొగరేమిటేవ్... నిన్ను తగలేస్తానేవ్... నిన్ను పాతేస్తానేవ్... నిన్ను మారణం చేస్తానేవ్..." అంటూ సహస్రం విప్పేసింది.

క్షణం దిక్కుతోచనట్టు బిక్కచచ్చి నిలబడింది సుజాత. ఆ తిట్లు వినేకొద్దీ ఏనుగు తొండంతో బాదుతున్నట్టు దిమ్మెక్కిపోతోంది తల.

అంతే- బకెట్టు మాటే మరిచిపోయి తన వాటాలోకి పరిగెత్తింది. తలుపులు వేసేసుకుంది. చెవులు మూసేసుకుంది.

అయినా బోలుగా వున్న గోడని తొలిచి లోనకు దూరే కన్నపు దొంగలా ఆ శబ్ద కాలుష్యం ఎలాగో సందుచేసుకుని ఆమె కర్ణభేరిని కంపింపజేస్తూనే వుంది.

పాపం సుజాత వయసెంతనీ- నిండా ఇరవై ఏళ్లు లేవు. పెళ్లయి ఇంకా ఏడాది కాలేదు. ఈ ఇంట్లో కాపురం పెట్టి నెలదాటలేదు. ఈ కాస్త పరిధిలో ఆమె సంపాయించిన లోకానుభవమేపాటిదని.

కందిరీగల తుట్టె అంటే తెలుసును గానీ దాన్ని కదిలిస్తే కలిగే పరిణామం మాత్రం ఎరుకలేదు మరి.

అది చాలదన్నట్టు, "హుఁ. నేను ఇంట్లో చేరేముందే చెప్పానా ఆవిడ జోలికి మాత్రం వెళ్లొద్దు సుమా అని- అంతగా నీకు పీకలమీద కొచ్చి నీళ్లు కావాల్సొచ్చాయే అనుకో- పక్కవాటా వాళ్ల నడగాలి- లేకపోతే పక్కవీధి వాళ్లన డగాలి- ఇంకాపోతే పక్కవూరి వాళ్లనడగాలి. అంతేగానీ, ఆవిడ బిందె ముట్టుకుంటావా- బుద్ధేవన్నా వుందా నీకు. ఇప్పుడేవయిందో చూశావా- ఆవిడ నోరు మూతపడేసరికి నీ ఝుటాలం కాస్తా వదిలిపోతుంది అనుభవించు''. మూలుగుతున్న నక్కమీద తాటిపండు పడ్డట్టు రెండు చేతుల మధ్యా తల ఇరికించుకు కూర్చున్న భార్యమీద మరి నాలుగు అక్షింతలు వేసి రుసరుసలాడుతూ స్నానం మాట దేవుడెరుగు- కాఫీ కూడా తాగకుండా బయటకు వెళ్లిపోయాడు సుజాత భర్త రామం.

ప్రస్తుతం వరకూ వారి దాంపత్య ప్రణయ జగత్తు సరస శృంగారం తోనూ చిలిపి చేష్టల తోనూ నిండి వుంది.

మగని ఆగ్రహాన్నీ చిరాకునీ ప్రథమంగా చవిచూసింది సుజాత. ఆమె కళ్లు నీళ్లతో నిండిపోయాయి.

అన్యమనస్కంగానే పనిలో జొరబడబోయింది సుజాత.

"హాయ్''.

వచ్చింది సుజాత కాలేజీ ఫ్రెండు అరుణ.

ఏదో ఇంటర్వ్యూ కొచ్చి వెడుతూ స్నేహితురాలిని పలకరించి పోడానికొచ్చింది.

"ఏమిటే కొత్త కాపురంలో హనీ జుర్రుకుంటూ వెలిగిపోతూ వుంటావనుకుంటే ఇట్లా ఆముదం తాగిన ఫేసేమిటి? ఏమిటి సంగతి?" వస్తూనే స్నేహితురాలి మొహంలో విషాద వీచికల్ని పసిగట్టేసి అంది అరుణ.

"ఓ గంట క్రితం వచ్చుంటే నేను చెప్పకుండానే తెలిసేది నీకు. ఇంట్లోకి రాకుండా వెనక్కి పరిగెత్తే దానివి." అంటూ తమ ఇంటావిడ ప్రతాపాన్ని వివరించి "ప్చ్ లాభం లేదు. మళ్లా ఆవిడ ఎదుట పడాలంటేనే భయమేస్తోంది. ఆయన్ని బతిమాలన్నా ఇల్లు మారాలి'' నిట్టూర్చింది సుజాత.

"ఛట్. ఓడిపోయి శత్రువుకి వెన్ను చూపిస్తావ్. షేమ్ షేమ్ - సిగ్గు సిగ్గు'' అరిచినంత పనిచేసింది అరుణ.



"ఏం చెయ్యమంటావ్. నన్నూ ఆవిడతో పాటు అరవమంటావా? అట్లా అరిచినా నెగ్గగలననే నమ్మకంలేదు. అలా వీధికెక్కే సిగ్గుమాలిన తనమూ లేదు."

"అదే తెలివి తక్కువంటే. నిన్ను ఆవిడతో దెబ్బలాడమనెవరన్నారు? ఉపాయం లేనివాళ్లని వూళ్లోంచి వెళ్లగొట్టమన్నారందుకే. ఆవిణ్ణి పడగొట్టే ట్రిక్ ఆలోచించవే పిచ్చి మొహమా... చందమామ కథ గుర్తు తెచ్చుకో; ఇట్లాంటి గయ్యాళి మదమణచటానికి ఆ వూరొచ్చిన కొత్త కోడలేమి చేసిందో తెలుసునా- వూరి చెరువు మధ్యన పడవ నిలిపి దానిమీద చీపురు చేత్తో పుచ్చుకు నించుందట.

ఈ గయ్యాళి మేళం పెద్దావిడ ఒడ్డున నిలబడి బారలు జాస్తూ చిందులు తొక్కుతూ గొంతు చించుకు వదరుతూ వుంటే ఆ బుర్ర వున్న చిన్నావిడ గంటకోసారి జాగ్రత్త అన్నట్టు చీపురుతో అదిలించి మళ్లీ రెచ్చగొట్టి వూరుకునేదట."

"తర్వాతేమయింది." కాఫీ కప్పందిస్తూ చిరునవ్వుతో అడిగింది సుజాత.

"ఏమవుతుంది- అరిచి అరిచి, తిట్టి తిట్టి నోరు బొంగురు పోయి ఒడ్డునున్నావిడ కాస్తా శోషొచ్చి పడిపోయింది. ఆ తర్వాత ఓటమి ఒప్పుకుని, మూటా ముల్లే సద్దుకుని వూరొదిలిపెట్టేసింది. నోరు మెదపకుండా విజయం సాధించిన కొత్త కోడలు జయజయధ్వానాలతో వూళ్లో ప్రవేశించింది అదీకథ. విన్నావా- అలా సాధించటానికి ప్రయత్నించు నువ్వు కూడా- బెస్టాఫ్ లక్."

దిగులు తీరగా తేటపడిన వదనంతో స్నేహితురాలిని సాగనంపింది సుజాత.

ఆ రాత్రి పొద్దుట విసుక్కున్నదానికి సారీ చెప్పాడు రామం. "ఇల్లు మారిపోదాం సుజా. ముందే ఆవిడ సంగతి వాళ్లూ వీళ్లూ చెప్పారు గానీ అంత పవర్‌ఫుల్ అనుకోలేదు నేను. ఆవిడతో నువ్వు పడలేవులే. ఇంకో ఇల్లు చూసుకుందాం" అని సముదాయింపజూస్తున్న భర్తను ఆపింది సుజాత.

"అవసరం లేదులెండి. ఆవిడ అరుపులకి దడిచి పారిపోయేదేమిటి?"

ఆశ్చర్యపోయాడు రామం. ఉదయం ఆవిడక్కడ గయ్యిమంటే పరిగెత్తుకు వచ్చి తలుపులేసుకున్న మనిషేనా ఈ పిల్ల. "నీకు అంత ధైర్యం ఎప్పుడొచ్చిందోయ్."

"ఆవిణ్ణి పడగొట్టే ఎత్తు నాదగ్గరున్నదిప్పుడు'' ధీమాగా చెప్పింది సుజాత.

"ఏమిటది?"

"సమయమొచ్చినప్పుడు మీకే తెలుస్తుందిలెండి." చిరునవ్వుతో అన్నది సుజాత.

ఆ ముహూర్తం రానే వచ్చింది.

★ ★ ★

ఆరోజు ఉదయం తొమ్మిదిన్నర గంటలయింది. రామం ఆఫీసుకు వెడుతుంటే తను గూడా గేటు వరకు వెంట వెళ్లి ఆమట్న అలాగే నిలబడింది సుజాత.

నిండు బస్తాల్లాంటి పుస్తకాల సంచులు మోస్తూ కూడా బరువు మాటే మరిచి కిలకిల్లాడుతూ పరుగులు తీస్తున్నారు స్కూలు పిల్లలు. వాళ్లను చూస్తూ, గడిచిపోయిన బంగారు బాల్యాన్ని తలుస్తూ క్షణం మైమరిచిపోయింది సుజాత.

ఆ క్షణకాల ఏమరుపాటులో మేక ఒకటి ఆవరణలో ప్రవేశించటంగానీ వరమ్మ ప్రాణప్రదంగా పెంచుకుంటున్న పొట్లపాదు మొదళ్లంటా లాగి నమలడంగానీ చూడలేదు.

నోరు తెరిచే అదనుకోసం కాచుకునుండే వరమ్మకి ఇంతకంటే సాకు ఏంకావాలి.

ముందు నానా తిట్లూ తిడుతూ కర్ర పెట్టి ఆ మేక నడుం విరగ్గొటి తరిమేసింది. ఆపైన ఆ గాలి సుజాతవైపు తిప్పింది. "బడితెలా నిలబడి దాన్ని లోపలికి రానిచ్చావటే. పచ్చని పాదంతా పొట్టన పెట్టేసుకుంటుంటే మిడి గుడ్లేసుకు చూస్తున్నావటే. నీ కళ్లకి పసికర్లు రానూ- ఒక్క అరుపరిస్తే నీ నాలుక తెగిపోతుందటే నీ నోరు పడిపోనూ- నాకు తెలుసునే- నా పాదు ఏపుగా ఎదగటం చూసి నీ కళ్ళు కుట్టాయి. అందుకే ఆ ముదనష్టపు మేక దాన్నిలా నమిలేస్తుంటే చూస్తూ వూరుకున్నావ్. కుళ్ళుమోతుదానా... నీ..." తిట్ల పంచాంగం అంతు కనుక్కుంటోంది వరమ్మ.

ఈసారి సుజాత తలుపులు వేసుకోలేదు. చెవులు మూసుకోనూ లేదు...

ఫోల్డింగ్ చెయిర్ తెచ్చుకుని వరండాలో వరమ్మ ఎదురుగా వేసుకుంది.

నీ లెక్కేమిటన్నట్టు ఒళ్లో టేప్ రికార్డర్ హైసౌండులో పెట్టుకుని పాటలు వింటూ కూర్చుంది.

ఆ నిర్లక్ష్యం వరమ్మకి కజ్జాకి కాలు దువ్వినట్టే అయింది. తోక కోసిన కోతిలా సివాలాడిపోయింది.

పాటలన్నీ ఆగిపోయాయి గానీ ఆవిడ వేసిన తిట్ల రికార్డు మాత్రం ఆగలేదు ఎంతకీ.

'ఆపండి.' గర్జించింది సుజాత పావుగంట తరవాత.

ఉరుములేని పిడుక్కి ఉలిక్కిపడినట్టు టక్కున నోరుకట్టింది వరమ్మ.

"ఇది వినండి."

టేప్ రికార్డర్ ఆన్ చేసింది సుజాత.

వరమ్మది టేప్‌కి సూటయ్యే కంఠమే.

పావుగంట నుంచీ ఆవిడ రాల్చిపోస్తున్న దీవెనల్నీ అక్షరం పొల్లు పోకుండా నిక్షిప్తమయ్యాయి.

"విన్నారుగా- ఇటుపైన నోరెత్తారా ఈ టేపు తీసుకెళ్లి పోలీస్ స్టేషన్లో అప్పగిస్తాను. అనవసరంగా ఒకరి మీదకు తగాదాకు పోయి తిట్టడం కూడా నేరమని తెలుసా మీకు. మీరలాటి రకమని చుట్టుపక్కల వారందరిచేత కూడా సాక్ష్యమిప్పిస్తాను. మిమ్మల్ని కటకటాల వెనక్కి తోయిస్తాను. జాగ్రత్త!"

ఉరిమి చూస్తూ 'ఖంగ్'మనే కంఠంతో అన్నది సుజాత.

అంతే గప్‌చుప్.

సుజాత ఆ ఇంట్లో ఉన్నంతకాలం వరమ్మ గొంతు మరి వినిపించలేదు. ★